# ఊరట

"ఎక్కడికి"? అడిగాడు కండక్టర్

చెప్పాను.

"తొమ్మిది రూపాయలు" అన్నాడు కండక్టర్ "పన్నెండురూపాయిలకి టిక్కెట్టు కట్ చెయ్యండి" అన్నాన్నేను ఇరవై కాగితం ఇస్తూ.

"మీరు దిగవలసిన చోటుకి తొమిదిరూపాయలే ఛార్జీ. పన్నెండెందుకు?" విస్తుపోతూ అడిగాడు కండక్టర్.

"ఛార్జీ ఎక్కువ చెల్లించి తక్కువ దూరం ప్రయాణం చెయ్యడం తప్పుకాదు కదా!"

నా మాటకు ఏమనుకున్నాడో ఏమో మరిమాట్లాడకుండా టిక్కెట్టిచ్చి వెళ్లిపోయాడు.

నాకు మెంటలేమోనన్నట్లు చూశారు పక్కనున్న పాసింజర్స్.

ఎవరేమనుకుంటే నాకేం? చేసిన తప్పు సరిదిద్దుకున్నందుకు నాకెంతో తృప్తిగా ఉందిప్పుడు 'హమ్మయ్య' అనుకుని గుండెలనిండా గాలిపీల్చుకున్నాను. ఇంతకీ నేను చేసిన తప్పేమిటని అడగరేం?

మొన్నీ మధ్యే డిగ్రీ పుచ్చుకున్నాను. ఉచిత కంప్యూటర్ శిక్షణాసంస్థలో చేరి రెండుమూడు కోర్సులు కూడా పూర్తిచేశాను. అనుకోకుండా గుంటూరు టొబాకో ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్‌లో ఉద్యోగానికి పిలుపు వచ్చింది.




ఇంటర్వ్యూకి వెళ్లి రావాలంటే ఎలా లేదన్నా రెండువందలు ఉండాలి. మాది ఆర్థికంగా వెనుక బడిన తరగతి.

నా తర్వాత ఇద్దరు చెల్లెళ్ళున్నారు. నాన్న సంపాదన తినడానికే చాలదు. ఈ పరిస్థితుల్లో అంత దూరం ఎలా వెళతాను? వాళ్లడిగిన అర్హతలన్నీ ఉండడం వల్ల ఉద్యోగం వస్తుందన్న కాన్ఫిడెన్స్ అయితే ఉంది గానీ డబ్బు ఎవరిస్తారు?

ఆమాటే అమ్మతో అంటే అలమండలో ఉన్న మావయ్య దగ్గరకెళ్ళి అడగమంది ఛార్జీలకు సరిపడ పదిహేను రూపాయలు ఇస్తూ.

సరేనని ఎంతో ఆశతో వెళితే అక్కడ మామయ్య లేడు.

కొడుకు దగ్గరికి హైదరాబాద్ వెళ్లాడని తెలిసింది. అత్తయ్య ఉండమన్నా మరి ఉండ బుద్ధి కాలేదు. వెంటనే వె(ఱ్ఱి)మొహం వేసుకుని వెనుదిరిగాను.

★ ★ ★

స్టాప్‌లో రెండుగంటలు పడిగాపులుపడ్డా మా ఊరి బస్సు రాలేదు. ఉదయం ఏమీ తినకపోవడం వల్ల నీరసంగా ఉంది. కళ్ళు తిరిగినట్లవ్వడంతో టీ తాగాను.

తర్వాత తెలిసింది ఛార్జీకి నా వద్ద రెండురూపాయలు తక్కువగా ఉన్నాయని. నా గుండె దడదడలాడింది.

జేబు చూసుకోకుండా టీ ఎందుకు తాగానా అని నన్ను నేను తిట్టుకున్నాను. పోనీ కొంతదూరంనడిచి పోదామంటే ఒంట్లో ఓపిక లేదు. ఏంచేయాలా అని ఆలోచిస్తూ ఉండగానే బస్సొచ్చింది.

బిలబిలా పది పదిహేనుమంది ఎక్కేసారు. ఆ బస్సు వదిలేస్తే మరో రెండుగంటల దాకా మరో బండి లేదు. ఏమైతే అది అయిందనుకుని బస్సెక్కి ఫుట్ బోర్డు మీద నిలబడ్డాను. కండక్టర్ రైట్ చెప్పడంతో బస్సు కదిలింది. అందరికీ టిక్కెట్లు ఇచ్చి

గేట్ దగ్గర కొచ్చాడు.

"విజయనగరానికి ఒక టిక్కెట్" అన్నాను ఐదు రూపాయల నోటు చూపిస్తూ.

"ఏడు రూపాయిలియ్యి" చిరాగ్గా అన్నాడు కండక్టర్.

"నా దగ్గర అంతే ఉంది ఎలాగో సరిపెట్టుకుని టిక్కెట్ ఇవ్వండి" అన్నాన్నేను.

"ఏంటి సరిపెట్టుకునేది. బస్సు మన బాబుది అనుకుంటున్నావా? ఏడురూపాయలియ్యి లేక పోతే బస్సు ఆపుతాను దిగిపో!" అసహనంగా అన్నాడు కండక్టర్.

చేసేదేంలేక "బాబ్బాబు" అంటూ బ్రతిమిలాడాను.

"ఏమిటయ్యా నీ నస. అవతల స్టేజీ వచ్చేస్తోంది. చెకింగ్ అయితే నా కొంప కూలుతుంది హోల్డాన్" అన్నాడు కండక్టర్.

బస్సు ఆగింది.

నాకు కావలసిందదే.

"ఏంటయ్యా మరీ ఇంత ఘోరం. నువ్వు మహా సుద్ధాత్ముడిలా. రెండు రూపాయలు అడ్జస్ట్ చెయ్యి లేకపోయావు. బస్సు ఆపితే నడిచి వెళ్లలేననుకుంటున్నావా" మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ బస్సు దిగిపోయాను.

స్టేజి దగ్గర్లో ఉండడం వల్ల నాలుగడుగులు నడిచి ఐదురూపాయలు ఛార్జీతో మరో బస్సెక్కి ఇల్లు చేరుకున్నాను.

తెలివిగా ఆపదనుండి బయటపడ్డా తప్పుచేశానన్న భావన నన్నో మూల పీడిస్తోంది. బస్సెక్కితే మినిమమ్ ఛార్జీ మూడురూపాయలు. ఇవ్వాళ ఆర్టీసీకి నా వల్ల మూడురూపాయలు నష్టం వచ్చింది. రేపు ఆ డబ్బులు డిపోలో జమచేద్దామన్నా వీలుపడదు.

పైగా నేరం చేసినందుకు భారీగా పినాల్టీ కట్టమంటారు. అందుకే నోరు మూసుకున్నాను. ఇప్పుడు ఈ ప్రయాణంలో తొమ్మిదిరూపాయలు ఛార్జీకి అదనంగా మూడురూపాయలు చెల్లించడంతో నా మనసుకు ఊరట లభించింది.

(ఫిబ్రవరి 2007 ఆంధ్రభూమిమంత్లీ)